క్లుప్తంగా

ఉచిత దంత వైద్యశిబిరం

– డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి



దంత వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న డీఎస్పీ

గూడూరురూరల్: పోలీసుల సంరక్షణకు ఉచిత దంత వైద్యశిబిరం ఏర్పాటు చేశామని, సిబ్బంది ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని గూడూరు డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి కోరారు. గూడూరులోని రూరల్ పోలీసుస్టేషన్‌లో బుధవారం హరిప్రియ దంత వైద్యశాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత దంత వైద్యశిబిరాన్ని డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి ప్రారంభించారు. రూరల్, రెండో పట్టణ సీఐలు జి.దశరథరామారావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

దక్కిలి: మండలంలోని ఆల్తూరుపాడు, దందవోలు, శ్రీపురం గ్రామాల్లో ఖాళీగా ఉన్న మూడు వార్డులకు సంబంధించి ఈనెల 19న ఎన్నికలు జరగనున్నాయి. ఈ సందర్భంగా బుధవారం ఆ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఎంపీడీఓ ప్రసన్నకుమారి పరిశీలించారు. సీనియర్ అసిస్టెంట్ సిరాజుద్దీన్ ఖాద్రి, పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మొక్కలు నాటి ప్రతిజ్ఞ



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

రాపూరు: మండలంలోని పశుసంవర్ధక పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం నా భూమి–నా దేశం కార్యక్రమంలో భాగంగా కళాశాల ప్రాంగణంలో విద్యార్థులు, అధ్యాపకులు మొక్కలు నాటి ప్రతిజ్ఞ చేశారు. కళాశాల ప్రిన్సిపల్ ఇందిర, అధ్యాపకులు శ్రీహరి, విశాలి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మహిళలకు చీరల పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న మొబీన్‌బాషా

కోట: పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి, కోట బిట్–2 ఎంపీటీసీ సభ్యుడు మొబీన్ బాష ఆధ్వర్యంలో బుధవారం కోటలో వెంకటగిరి సాహెబ్ చారిటబుల్ ట్రస్ట్, సమన్వయ సేవా సమితి సభ్యులతో కలిసి ఈద్గా ప్రాంగణంలో వందమంది మహిళలకు చీరల పంపిణీ, పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఇంతియాజ్, ఇస్మాయిల్, వెంకటరమణమ్మ, షంషాద్,గౌరమ్మ పాల్గొన్నారు.

మహాసభను జయప్రదం చేయండి



కరపత్రాలను విడుదల చేస్తున్న రమణయ్య

గూడూరురూరల్: ఆటోడ్రైవర్ల సమస్యల పరిష్కారానికి ఈనెల 27న శ్రీకాళహస్తిలో సీఐటీయూ కార్యాలయంలో జరిగే ఆటో యూనియన్ ప్రథమ మహాసభను జయప్రదం చేయాలని గూడూరు సీఐటీయూ ఆటో యూనియన్ కార్యదర్శి బి.వి.రమణయ్య కోరారు. గూడూరులోని మార్కెట్ సెంటర్ వద్ద బుధవారం మహాసభ కరపత్రాలను విడుదల చేశారు. ఆటో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని మహాసభను జయప్రదం చేయాలని కోరారు. ఆటో యూనియన్ పట్టణ అధ్యక్షుడు చిన్న, సహాయ కార్యదర్శి బి.రమేష్, సభ్యులు ఎస్కే షఫి, మున్నా, కోటయ్య, శివ, పుట్టయ్య, సుబ్రమణ్యం, ప్రశాంత్ పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఏపీడీ

సూళ్లూరుపేట: మండలంలోని ఆబాక, కోటపోలూరు గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ రవినాయుడు బుధవారం పరిశీలించారు. పనుల పని తీరుపై ఆరా తీశారు. కూలీలతో మాట్లాడి సమస్యను అడిగి తెలుసుకున్నారు. వివిధ రకాల పనులపై కూలీలకు అవగాహన కల్పించారు. ఏపీఎం నాగరాజు పాల్గొన్నారు.

జగనన్న లేఔట్లతో కల సాకారం

- చురుగ్గా గృహ నిర్మాణాలు
- కాలనీల్లో అన్ని మౌలిక వసతులు

దొరవారిసత్రం: దొరవారిసత్రం మండలం పరిధిలో 13 జగనన్న లేఔట్లకు గాను రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాల్లో భాగంగా పేదలందరికి ఇళ్ల పథకం కింద 686 గృహాలు మంజూరు చేసింది. ఇందులో ఇప్పటి వరకు 301 గృహాలు పూర్తి చేసుకుని లబ్ధిదారులు నివాసం ఉంటున్నారు. మిగిలిన గృహాలు రూఫ్, శ్లాబ్, బేస్ లెవల్, బిలో బేస్ లెవల్‌లో నిర్మాణాలు జరుగుతున్నాయి. ఆయా ప్రాంతాల్లోని సచివాలయ సిబ్బంది ఎప్పటికప్పుడు నిర్మాణాలను పరిశీలిస్తూ ఇంటి బిల్లులు పెడింగ్‌లో ఉండకుండా లబ్ధిదారుల ఖాతాల్లో నగదు సకాలంలో జమయ్యే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. మండల అభివృద్ధి అధికారులు, సంబంధిత హౌసింగ్ అధికారులు, ప్రజాప్రతినిధులు ఎప్పటికప్పుడు జగనన్న కాలనీల్లో పర్యటిస్తూ లబ్ధిదారులను చైతన్య పరిచి గృహాలు నిర్మించుకునేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇవే కాకుండా పీఎంఏవై గ్రామీణ్ పథకం కింద 2021–22లో డీవీ సత్రానికి 349 గృహాలు మంజూరు కాగా ఇందులో ఇప్పటివరకు 22 పూర్తి అయ్యాయి. మిగిలిన గృహాలన్నీ వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయి.



గొల్లపాలెంలో నివాసం ఉంటున్న లబ్ధిదారులు



పోలిరెడ్డిపాలెంలో పక్కా గృహం

డీవీ సత్రంలో 13 జగనన్న కాలనీల్లో...

డీవీ సత్రం మండలం పరిధిలో 13 జగనన్న కాలనీ లేఔట్లకుగాను 11 జగనన్న కాలనీల్లో ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్ శాఖ పరంగా రూ.54లక్షలు వెచ్చించి ఇప్పటికే విద్యుత్ సదుపాయం, తాగు నీటి వసతి, వీధులు ఏర్పాటు వంటి వసతులు కల్పించారు. అవసరమైన కాలనీల్లో గ్రావెల్ చదును చేశారు. అన్ని కాలనీల్లో గృహాలు నిర్మించుకునేలా సంబంధిత అధికారులు, మండల అభివృద్ధి అధికారులు చర్యలు చేపడుతున్నారు.

సొంతింటి కల నెరవేరింది..



నా భర్త షేక్ సద్దామ్ బెల్దారీ మేస్త్రీ. పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఏలాంటి స్థిరాస్తులు లేవు. సొంత ఇంటి నిర్మాణం మాకు కలగా మారింది. జగనన్న పేదలందరికి ఇళ్ల పథకం కింద గృహాలు కేటాయించడంతో మా సొంత ఇంటి కల నేరవేరింది. జగనన్నకు రుణ పడి ఉంటాం.

షేక్ ఆఫ్రీన్, గొల్లపాలెం

పక్కాగృహం మంజూరైంది



గతంలో పక్కాగృహం కోసం పలుమార్లు దరఖాస్తు చేసుకున్నా ఫలితం లేకుండాపోయింది. జగనన్న ప్రభుత్వంలో పక్కాగృహం మంజూరు చేశారు. చక్కగా నిర్మించుకుని పక్కాగృహంలో నివాసం ఉంటున్నాం. ఏళ్లనాటి గృహ నిర్మాణ కల నెరవేరింది.

పేరంశెట్టి కల్యాణి, పోలిరెడ్డిపాలెం

పక్కాగృహాలు నిర్మించుకునేలా చైతన్యం...



మండల పరిధిలోని జగనన్న కాలనీల్లోని లబ్ధిదారులతో సమావేశాలు నిర్వహిస్తూ పక్కాగృహాలు నిర్మించుకునేలా వారిలో చైతన్యం తీసుకొస్తున్నాం. గృహాల నిర్మాణ విషయంలో ఏలాంటి లోటుపాట్లు ఉన్నా ఎప్పటికప్పుడు స్పందిస్తూ చర్యలు చేపడుతున్నాం. గృహ లబ్ధిదారులకు ఏ ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నాం.

బి. సింగయ్య, ఎంపీడీఓ, డీవీ సత్రం

బిల్లులు పెండింగ్ లేకుండా చూస్తున్నాం..



మండలంలోని పక్కాగృహాల బిల్లులు చెల్లింపు విషయంలో పెండింగ్ లేకుండా చూస్తున్నాం. బిల్లులు పెట్టే విషయంలో సచివాలయంలోని ఇంజినీరింగ్ అసిస్టెంట్లు గృహాల పనులు పరిశీలిస్తూ బిల్లులు పెడుతున్నారు. లబ్ధిదారులకు అందాల్సిన సిమెంట్, ఐరన్ అన్ని సకాలంలో రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుంది.

కె. మోహన్‌రావు, ఇన్‌చార్జ్ ఏఈ, డీవీ సత్రం

ప్రజాసంక్షేమానికి పెద్దపీట



లబ్ధిదారులకు బుక్‌లెట్‌ను అందజేస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

● నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

సైదాపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి అన్నారు. మండలంలోని చీకవోలు సచివాలయం పరిధిలోని రెండు రోజుల పాటు జరిగే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో బుధవారం నేదురుమల్లి పాల్గొన్నారు. నేదురుమల్లికి స్థానికులు ఘనస్వాగతం పలికారు. ఆయన గడప గడపకు వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి లబ్ధిదారులకు బుక్‌లెట్లను అందజేశారు. ఏఏ సంక్షేమ పథకానికి ఎవ్వరు అర్హులన్న విషయాన్ని అక్కడక్కడ వివరించారు. నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ 2014లో మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం ప్రజలను నట్టేట ముంచిందన్నారు. రాజధాని విషయంలో త్రీడీ సినిమాలను సైతం మైమరిపించేలా ప్రజలను భ్రమలోకి తీసుకుపోయిందన్నారు. అలాంటి టీడీపీని నేడు ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. 2024లో వైఎస్సార్‌సీపీ ప్రభంజనం సృష్టిస్తుందన్నారు. వెంకటగిరి నియోజకవర్గాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా అడుగులు వేస్తున్నట్లు వివరించారు. జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ కార్యదర్శి దాసరిరాజు శంకర్‌రాజు, జేసీఎస్ కన్వీనర్ గుంటమడుగు శ్రీనివాసులురాజు, సొసైటీ అధ్యక్షుడు శివకుమార్, నేతలు తోట శంకర్‌రెడ్డి, వివేక్‌రెడ్డి, గంగాధర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, వరదబండి ప్రభాకర్‌రెడ్డి, రాంగోపాల్‌రెడ్డి, జనార్దన్‌రాజు, అబ్బిరాజు, వైఎస్ ఎంపీపీ కత్తి ఈశ్వరమ్మ, సర్పంచ్ బట్టా వెంకటయ్య పాల్గొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

చీకవోలు సచివాలయం పరిధిలో గురువారం మధ్యాహ్నం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. నేదురుమల్లి పాల్గొంటారని, పార్టీ శ్రేణులు, అధికారులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చాయి.

ఏరియా ఆస్పత్రిలో విచారణ



ఆస్పత్రిలో సిబ్బందిని విచారిస్తున్న ఆర్డీఓ

గూడూరురూరల్: గూడూరులోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ఆపరేషన్ థియేటర్ అసిస్టెంట్‌పై కొంత మంది ఆర్డీఓకు ఫిర్యాదు చేయడంతో బుధవారం ఆర్డీఓ కిరణ్‌కుమార్ విచారణ చేశారు. ఆస్పత్రిలో రికార్డులను తనిఖీ చేసి సిబ్బందిని విచారించారు. ఆర్డీఓ మాట్లాడుతూ ఆపరేషన్ థియేటర్ అసిస్టెంట్ గోపీపై ఫిర్యాదులు వచ్చాయని, ఈ విషయంపై బాధితులతో మాట్లాడామన్నారు. వైద్యశాఖ ఉన్నతాధికారులు, విజిలెన్స్, ఏసీబీ అధికారులతో విచారణ జరిపించి నివేదిక ఇవ్వాలని కోరుతామని, నివేదిక ఆధారంగా చర్యలు తీసుంటామని తెలిపారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షరీనా, డాక్టర్ రాజా పాల్గొన్నారు.

అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నాం



లబ్ధిదారులకు బుక్‌లెట్‌లను అందజేస్తున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

● ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

నాయుడుపేటటౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నామని సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మేనకూరు సచివాలయం పరిధిలో జరిగింది. ముందుగా వైఎస్సార్‌సీపీ పార్టీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కట్టా వెంకటరమణారెడ్డి, విజయ పాల డెయిరీ డైరెక్టర్ కట్టా భవానిరెడ్డి సారథ్యంలో ఎమ్మెల్యేకు ఘనస్వాగతం లభించింది. ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని బుక్‌లెట్‌లను అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులందరికీ ప్రభుత్వ పథకాలను అందిస్తున్నామని పేర్కొన్నారు. చలివేంద్రం, వద్దిగుంటకండ్రిగ, ఎర్రపుశెట్టి కండ్రిగ, పాళెపోలం, కోనేటి రాజుపాళెం, మేనకూరు ప్రాంతాల్లో ఎమ్మెల్యే ఇంటింటా పర్యటించారు. జగనన్నను మళ్లీ ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ టి. సుబ్రహ్మణ్యంరెడ్డి, ఎంపీపీ కురుగొండ ధనలక్ష్మి, కో ఆప్షన్ సభ్యుడు బాష, సచివాలయాల జేసీఎస్ కన్వీనర్ కిషోర్‌యాదవ్, ఎన్‌డీసీసీబీ మాజీ డైరెక్టర్ కే మాధవరెడ్డి, కె. జయరామయ్య, ఎన్ ప్రకాశం, బి.అల్లెయ్య, ఎస్ రవి, పి. రాహుల్, చంద్ర పాల్గొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

వెంకటగిరిరూరల్: పట్టణంలోని 18, 19, 20 వార్డు పరిధిలో వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షులు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఉదయం 6.30 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు నేదురుమల్లి కార్యాలయం బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అధికారులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

ర్యాలీని విజయవంతం చేయండి

రాపూరు: ఈనెల 20న నెల్లూరులో జరిగే మాదిగల చైతన్య ర్యాలీని వెంకటగిరి నియోజకవర్గ మాదిగలు విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధికారిక ప్రతినిధి రంగయ్య బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ర్యాలీ నెల్లూరులోని ఏబీఎం కాంపౌండ్ నుంచి 3 గంటలకు బయలుదేరి అంబేడ్కర్ విగ్రహం వరకు సాగుతుందన్నారు.

రెండు జేసీబీలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న జేసీబీలు

సైదాపురం: అక్రమంగా ఖనిజ సంపదను తీస్తున్న రెండు జేసీబీలను బుధవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. లింగసముద్రం గ్రామసమీపంలో ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఖనిజ సంపద కోసం తవ్వకాలు సాగిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందడంతో ఎస్‌ఐ చల్లా వాసు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. తవ్వకాలను సాగిస్తున్న రెండు జేసీబీలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వైఎస్సార్‌సీపీతోనే జీవితాల్లో వెలుగులు



కరపత్రాన్ని విడుదల చేస్తున్న నేతలు

రాపూరు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ముస్లింల జీవితాల్లో వెలుగులు నింపిందని వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం తిరుపతి జిల్లా అధ్యక్షుడు షేక్ మహ్మద్‌రసూల్ తెలిపారు. రాపూరు, ఓబులాయిపల్లి గ్రామాల్లో బుధవారం మసీదులను సందర్శించి హర్‌దిల్ వైఎస్సార్, హం సబ్ జగన్‌కే సాత్ కరపత్రాలను ఆవిష్కరించారు. వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ షిపీ ఆహ్మద్, మైనారిటీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి యజ్దాన్ బాషా, మైనార్టీ, వైఎస్సార్‌సీపీ నేతలు డాక్టర్ బాదర్‌బా, గౌస్‌పీర్, బాబు, ఇలియాజ్, మస్తాన్ పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరానికి స్పందన



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

నాయుడుపేటటౌన్: భగవతే మల్లికాంభ ఆలయం వద్ద బుధవారం శంకర నేత్రాలయ ఆధ్వర్యంలో జరిగిన ఉచిత ఉంటి వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరంలో 65 మంది కంటి పరీక్షలు చేసుకున్నారు. వీరిలో 20 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేసి చెన్నై శంకర నేత్రాలయకు తీసుకెళ్లనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. నేతలు ముత్యాలరెడ్డి, విజయకుమార్ నాయుడు, ఆలయం కమిటీ చైర్మన్ అమాస వెంకటసుబ్బయ్య, మల్లికార్జున, రామనారాయణ, శంకర్ నేత్రాలయ వైద్యులు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణాలకు అనుమతులు ఇవ్వండి



వినతిప్రతం అందజేస్తున్న ఎమ్మెల్యే, గ్రామస్తులు

– సీసీఎఫ్‌ను కోరిన ఎమ్మెల్యే, గ్రామస్తులు

గూడూరురూరల్: గూడూరు నియోజకవర్గంలోని వాకాడు, చిట్టమూరు, చిల్లకూరు మండలాల్లో అటవీ అనుమతులు కారణంగా రోడ్ల నిర్మాణాలకు అడ్డంకిగా మారిందని, ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అటవీ అనుమతులు మంజూరు చేయాలని చీఫ్ కన్జర్వేషన్ ఆఫ్ ఫారెస్ట్ అధికారి మధుసూదన్‌రెడ్డిని ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు, బురదగాలికొత్తపాళెం సర్పంచ్ మణి, గ్రామస్తులు కలిసి వినతిపత్రం అందజేశారు. బుధవారం మంగళగిరిలోని అరణ్య భవనంలో సీసీఎఫ్‌ను కలిసి నియోజకవర్గంలోని మూడు రోడ్ల నిర్మాణాలకు అనుమతులు ఇవ్వాలని కోరారు. ప్రతిపాదనలకు సానుకూలంగా స్పందించిన సీసీఎఫ్ పూర్తి సహకారం అందిస్తామని చెప్పారని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

జేసీఎస్ కన్వీనర్ నియామకం



శ్రీనివాసులురాజు

సైదాపురం: సైదాపురం మండల జేసీఎస్ కన్వీనర్‌గా శ్రీనివాసులురాజును ఎంపిక చేశారు. జేసీఎస్ కన్వీనర్‌గా ఎంపిక చేసిన వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిని బుధవారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. శ్రీనివాసులురాజుకు వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు.

అప్రమత్తతతోనే ప్రమాదాల నివారణ

తిరుపతి అర్బన్: అప్రమత్తతతోనే ప్రమాదాలను నివారించవచ్చని ఇన్‌చార్జి డీపీటీఓ జితేంద్రనాథ్ రెడ్డి తెలిపారు. తిరుపతి జిల్లా ప్రజా రవాణా కార్యాలయంలో బుధవారం ఆర్టీసీ డ్రైవర్లకు శిక్షణ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఆర్టీసీలోని డ్రైవర్లకు విధుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఈ నెల 29వ తేదీ వరకు శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. నిరంతరం బస్సు కండిషన్‌ను పరిశీలించాలని సూచించారు. మద్యం తాగి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలను నడపరాదన్నారు. ప్రయాణికులతో గౌరవంగా నడుచుకోవాలన్నారు. డెప్యూటీ చీఫ్ మెకానిక్ ఇంజినీర్ నరసింహులు, డీఎం బాలాజి పాల్గొన్నారు.

ఉద్యానవన పంటల సాగుపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఓ

చిల్లకూరు: ఉపాధి పథకం కింద రాయితీపై అందించే ఉద్యానవన పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని క్షేత్ర సహాయకులకు ఉపాధి ఏపీఓ గిరబాబు సూచించారు. మండల ఉపాధి హామీ కార్యాలయంలో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చిన్న, సన్న కారు రైతులు ఉద్యాన పంటలు సాగు చేసుకుని దీర్ఘకాలికంగా ఆదాయం పెంచుకునేలా వారికి అవగాహన కల్పించాలని అన్నారు.

జాతరను తలపిస్తున్న సంబరాలు



పోలేరమ్మ ఆలయం వద్ద పూజలు

–పోలేరమ్మ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు

వెంకటగిరిరూరల్: వెంకటగిరి పోలేరమ్మ జాతరను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర పండుగగా గుర్తిస్తూ జీఓ విడుదల చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ వెంకటగిరి మున్సిపాలిటీ కౌన్సిలర్లు ఆధ్వర్యంలో పలు వార్డుల్లో జరుగుతున్న పోలేరమ్మతల్లికి ప్రత్యేక పూజలు, సంబరాలు పోలేరమ్మ జాతరను తలపిస్తున్నాయి. బుధవారం 16వ వార్డు కౌన్సిలర్ ధనియాల రాధమ్మ ఆధ్వర్యంలో పూజలు వైభవంగా జరిగాయి. ముందుగా తూర్పువీధిలోని రాధమ్మ నివాసం వద్ద రాజా కుటుంబీకులు, ఎస్వీబీసీ చైర్మన్ డాక్టర్ వీబీ సాయికృష్ణ యాచేంద్ర ప్రత్యేక పూజలు చేశారు. సంబరాల్లో పోలేరమ్మకు అత్యంత ప్రీతిపాత్రమైన పత్తిసొంగెంను, వెయ్యికళ్లదుద్దలతో ఆసాదుల తప్పెట్ల తాళ్ల మధ్య పోలేరమ్మతల్లి ఆలయం వరకు గ్రామోత్సవం నిర్వహించారు. దీంతో పట్టణంలో ముందస్తు పోలేరమ్మ జాతరను వచ్చేసిందా అన్న చందంగా పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. పోలేరమ్మ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ దొంతుశారద, పూజారి లక్ష్మి, వైస్ చైర్మన్ ఎస్ బాలయ్య, చింతపట్ల ఉమామహేశ్వరి, పట్టణ కన్వీనర్ జి ఢిల్లీబాబు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న హోంగార్డు



వృద్ధురాలికి ఆహారం అందిస్తున్న వరప్రసాద్

పెళ్లకూరు: స్థానిక హోంగార్డు గంధం వరప్రసాద్ బుధవారం ఓ అనాథ వృద్ధురాలికి ధాతృత్వంతో ఆహారం అందించడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఓ అనాథ వృద్ధురాలు కొన్ని రోజులుగా పెళ్లకూరు పరిసర ప్రాంతాల్లో తిరుగలాడుతోంది. భాష తెలియక కడుపు నింపుకునే అవకాశం లేక రెండు రోజులుగా బస్టాండ్ ప్రాంతంలో అచేతన స్థితిలో పడి ఉంది. ఎప్పుడూ జనం రద్దీగా తిరిగే ఆ ప్రాంతంలో వృద్ధురాలిని పట్టించుకునేవారు లేరు. అయితే విషయం తెలుసుకున్న హోంగార్డు ఆహారం తీసుకొచ్చి ఆమెకు పెట్టడం, కాస్తంత ఓపిక వచ్చాక ఆమెను తీసుకెళ్లి స్థానిక పీహెచ్‌సీలో వైద్య పరీక్షలు చేయించి వైద్యం అందించడంపై స్థానికులు హోంగార్డు సేవలను ప్రశంసించారు.

దివ్యాంగులకు ట్రై సైకిళ్ల పంపిణీ



ట్రై సైకిళ్లను అందజేస్తున్న ప్రతినిధులు

చిల్లకూరు: తమ్మినపట్నం గ్రామంలోని జిందాల్ సింహపురి ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు ట్రైసైకిళ్లను పంపిణీ చేశారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా మంగళవారం పరిశ్రమలో జరిగిన కార్యక్రమంలో పరిశ్రమ సీఎస్సార్ కింద ముగ్గురు దివ్యాంగులకు ట్రై సైకిళ్లను అందజేశారు. పరిశ్రమ హెడ్ శ్రీనివాస్‌రావ్, సుల్తాన్ అహ్మద్ మన్సూరి, సరోజ్ కుమార్‌పాత్రి, దిలీప్‌కుమార్, విల్సన్, మ్యాథ్యూ పాల్గొన్నారు.

మృతుల పేర్లను తొలగించండి



మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాసులు

చిల్లకూరు: ఓటర్ల జాబితాలో మృతి చెందిన వారి పేర్లను తొలగించేందుకు ఫారం–7 కచ్చితంగా ఉపయోగించాలని తహసీల్దార్ శ్రీనివాసులు బీఎల్ఓలకు సూచించారు. మండల రెవెన్యూ కార్యాలయంలో బుధవారం బీఎల్ఓలతో సమీక్ష నిర్వహించారు. డీటీ అజ్మత్తుల్లాఖాన్ పాల్గొన్నారు.